సాక్షి నిజామాబాద్

శనివారం । 25 । నవంబర్ । 2023



అంతుచిక్కని ఓటరు నాడి

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఓటర్లు ఎటు వైపు మొగ్గుతారో తెలియక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



కామారెడ్డిలో బాహాబాహీ

కామారెడ్డిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య బాహాబాహీకి దిగారు. పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /21.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కామారెడ్డికి మోదీ





సాక్షి, కామారెడ్డి : ప్రధాన మంత్రి మోదీ శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ మేరకు బీజేపీ శ్రేణులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేశాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివస్తారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మోదీ ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఇందిరా గాంధీ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుంటారు. సభలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు పలువురు రాష్ట్ర నేతలు పాల్గొంటారు.

బోధన్‌కు రాహుల్‌గాంధీ..



బోధన్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బోధన్ శివారు లోని నర్సాపూర్ క్రాసింగ్ వద్ద విజయభేరి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. శుక్రవారం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సభా ఏర్పాట్లను పరిశీలించారు. పాషామోహినోద్దీన్, తూము శరత్ రెడ్డి, మహ్మద్ గౌసోద్దీన్ పాల్గొన్నారు.

రైతు బంధుపై ఈసీ సానుకూల స్పందన

- మంత్రి వేముల హర్షం..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రైతుబంధును కొనసాగించేలా సీఎం కేసీఆర్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం.. ఈసీ సానుకూలంగా స్పందించడంపై మంత్రి, బీఆర్ఎస్ బాల్కొండ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. యాసంగి పంట పెట్టుబడి సాయం అందకుండా ఎన్నికల సాకును చూపి రైతుబంధు ఆపాలని చూసిన ప్రతిపక్షాలకు ఇదో గుణపాఠమన్నారు. పంట పెట్టుబడి సాయాన్ని కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతులకు అందించి వారికి తోడుగా నిలబడ్డారు. ఇది రైతు ప్రభుత్వమని చాటి చెప్పారని గుర్తు చేశారు. రైతుబంధు పైసలు శనివారం నుంచి అందరి ఖాతాల్లో చేరుతాయని, రైతులు యాసంగి పంటలకు పెట్టుబడిగా వినియోగించుకోవాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి కోరారు.





మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేదికపై బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల అభ్యర్థులు అన్నపూర్ణమ్మ, పైడి రాకేశ్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ తదితరులు

కేసీఆర్ శకం ముగిసింది

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. ప్రధాని మోదీ పెట్రోల్, డీజిల్‌పై కస్టమ్ డ్యూటీ తక్కువ చేసినా.. కేసీఆర్ జీఎస్టీ తగ్గించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే జీఎస్టీ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తుందన్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడిన వారిని జైళ్లో పెడతామన్నారు.

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల మనిషి మంత్రి కాలేడు
- బీడీ కార్మికుల కోసం 500 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం
- ముస్లిం రిజర్వేషన్లను తొలగించి ఓబీసీ, ఎస్సీలకు కేటాయిస్తాం
- ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల సకల జనుల సంకల్ప సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా

ఆర్మూర్: అవినీతి మయమైన కేసీఆర్ శకం ముగిసిపోయిందని, ప్రపంచ దేశాల్లో భారత దేశాన్ని మొదటి స్థానంలో నిలిపిన ప్రధాని నరేంద్ర మోదీ పాలన తెలంగాణలో రాబోతోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులో శుక్రవారం నిర్వహించిన ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల సకల జనుల సంకల్ప సభలో అమిత్ షా మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో డబ్బులు ఇచ్చే వారే మంత్రులు అవుతారు కానీ ప్రజల మనిషి మంత్రి కాలేడన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు కేటాయించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించి ఓబీసీ, ఎస్సీలకు అవకాశం కల్పిస్తామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు.

ఇందూరు నుంచే మార్పునకు నాంది..

తెలంగాణ రాష్ట్రానికి అన్నం పెట్టడమే కాదు రాష్ట్రంలో మార్పునకు నాంది పలికే జిల్లా నిజామాబాద్ అని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రైతు బంధు ఇస్తున్నామనే కారణం చెపుతూ డ్రిప్ ఇరిగేషన్, ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతులను సీఎం కేసీఆర్ తీవ్రంగా నష్టాల పాలు చేస్తున్నాడని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే విద్య, వైద్య రంగాల్లో నాణ్యమైన సేవలను అందిస్తామన్నారు. గజ్వేల్, కామారెడ్డిల్లో కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు.



ఈటల రాజేందర్

■ రజాకార్ల భయంతో కేసీఆర్ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదన్నారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడిన వారిని జైళ్లలో పెడతామన్నారు. మోదీ పెట్రోల్, డీజిల్‌పై కస్టమ్ డ్యూటీ తక్కువ చేసినా కేసీఆర్ జీఎస్టీ తగ్గించలేదన్నారు. బీజేపీ జీఎస్టీ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తుందని అమిత్ షా అన్నారు.

■ జిల్లాలో బీడీ కార్మికుల కోసం 500 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామన్నారు.

■ ఆర్మూర్ ఆర్టీసీ బస్ డిపో స్థలాన్ని కబ్జా చేసి షాపింగ్ మాల్ కట్టిన వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించడం వెనుక అవినీతి ఉందన్నారు.

పసుపు బోర్డు ఉత్తర్వులు..

ప్రధాన మోదీ జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీంతో పసుపు ఎగుమతులు పెరిగి గిట్టుబాటు ధర పెరుగుతుందన్నారు. పసుపుతో మెడిసిన్ తయారు చేసే పరిశోధనలు సైతం తాము ప్రారంభిస్తామన్నారు.

గల్ఫ్ బాధితుల కోసం ఎన్ఆర్ఐ సెల్..

తెలంగాణ నుంచి లక్షల మంది ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎన్ఆర్ఐ సెల్‌ను ఏర్పాటు చేస్తామని అమిత్‌షా భరోసా ఇచ్చారు.

బాయిల్డ్ రైస్ కొనుగోలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేయని బాయిల్డ్ రైస్‌ను బీజేపీ ప్రభుత్వం గిట్టుబాటు ధరకే కొనుగోలు చేస్తుందన్నారు. వరి ధాన్యాన్ని క్వింటాలుకు రూ.3,100 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకానికి చెల్లించాల్సిన ప్రీమియంను రైతులు చెల్లించాల్సిన అవసరం లేదని, బీజేపీ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. మహిళలకు ఏడాదికి నాలుగు సిలిండర్లను ఉచితంగా అందజేస్తామన్నారు. సభలో పార్టీ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, లోక భూపతిరెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, బస్వా లక్ష్మి నర్సయ్య, పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ప్రజలు పాల్గొన్నారు.

అవినీతి పాలన అంతమొందిద్దాం..

- పైడి రాకేశ్‌రెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థి

రాష్ట్రంలో అవినీతి పాలన అంతమొందించడానికి బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ ఆర్మూర్ అభ్యర్థి పైడి రాకేష్‌రెడ్డి కోరారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం..

- అన్నపూర్ణమ్మ, బాల్కొండ అసెంబ్లీ అభ్యర్థి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పార్టీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

ఇలా వచ్చారు..

■ ఆర్మూర్ మండలం చేపూర్ శివారులో క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.35 గంటలకు అమిత్‌షా వచ్చారు.

■ రోడ్డు మార్గం గుండా సభా స్థలికి 1.45 గంటలకు చేరుకున్నారు. 13 నిముషాల పాటు సభలో ప్రసంగించారు.



ధర్మపురి అర్వింద్

కాంగ్రెస్‌లో 33మంది కేసీఆర్ మనుషులే..

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థుల్లో 33 మంది సీఎం కేసీఆర్ మనుషులేనని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. కేసీఆర్‌కు కోవర్టులుగా పని చేస్తూ వీరు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో నిలిచారన్నారు. అందువల్ల బీఆర్ఎస్ వ్యతిరేక ఓటును కాంగ్రెస్‌కు వేసి వేస్ట్ చేయకుండా బీజేపీకి వేయాలన్నారు.





ఆర్మూర్‌లో అమిత్‌షా సభకు హాజరైన బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల ప్రజలు

ప్రజలే నా ధైర్యం.. నమ్మకం

- కులమతాలకు అతీతంగా అభివృద్ధి
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నా..
- సాక్షి ఇంటర్వ్యూలో అర్బన్ బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా

ప్రజలే తన ధైర్యం.. నమ్మకమని నిజామాబాద్ అర్బన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. తెలంగాణ రాకముందు ఇందూర్ నగరం ఏ విధంగా ఉందో.. ఇప్పుడు ఎలా ఉందో అందరికి తెలుసని పేర్కొన్నారు. తనకన్న ముందు ఉన్నవారు నగరాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. పక్కా ప్రణాళికతో నగరాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. మళ్లీ అవకాశం ఇస్తే ఇందూరును దేశంలో మొదటి స్థానంలో ఉంచడానికి అనుక్షణం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల నేపథ్యంలో గణేశ్‌గుప్తాతో సాక్షి ఇంటర్వ్యూ..

– నిజామాబాద్ నాగారం

☛ నగర అభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేశారు?

✤ నిజామాబాద్ నగరాన్ని ఇప్పటి వరకు రూ.వేయి కోట్లతో అభివృద్ధి చేశాను. విశాలమైన రోడ్లు, డివైడర్లు, పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, మినీ ట్యాంక్‌బండ్, సమీకృత మార్కెట్ సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే అండర్ బ్రిడ్జి, ఐటీ హబ్, వైకుంఠధామాలు తదితర పనులు పూర్తి చేశాను. 2018 ఎన్నికల సమయంలో ప్రజలకు నును చేయబోయే అభివృద్ధి పనులకు సంబంధించి మోడల్ బుక్‌లెట్ పంపిణీ చేశా. దానిని ఐదేళ్లలో పూర్తి చేసి ప్రజల కళ్ల ముందు ఉంచాను.

☛ యూజీడీ పనులు పూర్తయ్యాయా?

✤ ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నేను ఎమ్మెల్యే కాకముందు నుంచే జరిగాయి. రోడ్లను మధ్యలో తవ్వేయడంతో రాకపోకలు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో సీఎం కేసీఆర్‌ను అడిగి నిధులు తెచ్చి 2019లో యూజీడీ పనులు పూర్తి చేయించాను. ప్రతి ఇంటి నుంచి యూజీడీకి కనెక్షన్ ఇవ్వాలి. దీనికి ఒక్కొక్కరికి రూ.8 వేలకు పైగా ఖర్చు అవుతుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేసీఆర్‌ను ఒప్పించి రూ.45కోట్ల నిధులు తెచ్చి టెండర్ ప్రక్రియ పూర్తి చేయించాను. ఎన్నికలు పూర్తి కాగానే ఈ పనులు ప్రారంభం అవుతాయి.



☛ ప్రస్తుతం నగరంలో తాగునీటి సమస్య ఉందా?

✤ నగరంలో ఇంటింటికి తాగునీరు సరఫరా అవుతోంది. ట్యాంకర్ల ద్వారా సరఫరాకు చెక్ పెట్టడానికే మిషన్ భగీరథ ద్వారా పైపులైన్‌లు వేశాం. 24గంటల పాటు మంచినీరు సరఫరా చేయడానికి కార్యాచరణ రూపొందించాం.

సాక్షి ఇంటర్వ్యూ

☛ ప్రచారంలో ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

✤ నేను అనుక్షణం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నా. నగరంలో ఉన్న పరిస్థితులు, సమస్యలు పరిశీలించి పరిష్కరించా. నేను చేసిన అభివృద్ధిపై బుక్‌లెట్ ప్రింట్ చేసి ఇంటింటికి పంచుతూ ఓట్లు అడుగుతున్నా. ప్రజల నుంచి మంచి స్పందన ఉంది. ప్రజలే నా ధైర్యం, నమ్మకం.. మూడోసారి గెలిపిస్తారని నమ్ముతున్నా.

☛ ఆత్మీయ సమ్మేళనాలతో ప్రచారం చేపట్టారు. అన్ని కులాలకు దగ్గరయ్యారా?

✤ నేను ఎల్లవేళలా ప్రజలతో ఉన్నా. నగరంలోని అన్ని డివిజన్లలో పర్యటించాను. కులమతాలకు అతీతంగా కుల సంఘాలకు, ఆలయాలు, మసీదులు, చర్చిలకు నిధులు ఇచ్చి భవనాలు పూర్తి చేయించాను. ఆత్మీయ సమ్మేళనాలతో నేను ఏం చేశానో ప్రజలకు వివరించాను.

☛ ఎన్నికల మేనిఫెస్టో ఏ విధంగా ఉంది?

✤ సీఎం కేసీఆర్ ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి రూ.5లక్షల కేసీఆర్ భీమా, సన్నబియ్యం, ఆసరా పెన్షన్ రూ.5వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, రైతు బంధు రూ.16వేలు, మహిళలకు రూ.3 వేలు అందిస్తాం. చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేస్తున్నాం.

☛ ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారు?

✤ ఎన్నికలు వస్తాయి, పోతాయి. రకరకాల పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తారు. ఒక్కసారి గుండె మీద చెయ్యి వేసి మనస్ఫూర్తిగా ఆలోచన చేయండి. నేను తొమ్మిదిన్నర ఏళ్లలో నగరాన్ని ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చేశా. నా కన్న ముందు పెద్ద పెద్ద నాయకులు పోటీ చేసినా అభివృద్ధి చేయలేదు. అనుక్షణం ప్రజల్లో ఉండి ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తూ, సదుపాయాలు కల్పించా. నగరాన్ని రాష్ట్రంలో, దేశంలో నంబర్ వన్‌గా ఉంచడానికి కష్టపడుతునే ఉన్నాను. ఏ కష్టం వచ్చినా ప్రజలకు అండగా ఉంటున్నా. అందుకే ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నా.

త్రిముఖ పోరు

ఉమ్మడి జిల్లాలో పోటాపోటీ

- కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌లకు చెమటలు పట్టిస్తున్న బీజేపీ అభ్యర్థి
- ఆర్మూర్‌లో అనూహ్యంగా దూసుకొచ్చిన బీజేపీ
- బాల్కొండ, జుక్కల్‌లో అన్నపూర్ణమ్మ, అరుణ తారకు పెరిగిన ఆదరణ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీగా తలపడుతుండగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మాత్రం త్రిముఖ పోరు నడుస్తోంది. మూడు పార్టీలు తగ్గేదేలే అన్నట్లుగా బరిలో సమరోత్సాహం ప్రదర్శిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఆసక్తి రేకెత్తిస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బరిలోకి దిగగా వారిద్దరికీ దీటుగా బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గెలుపు తనదేనంటూ సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. దీంతో గెలుపు ఎవరిదన్నది అంతుపట్టని విధంగా తయారైంది. మూడు పార్టీల ఎత్తులు, పై ఎత్తులు, జాతీయ అగ్రనేతల పర్యటనలతో కామారెడ్డిలో రాజకీయం రసవత్తరంగా మారింది.

■ నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ, బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ మధ్య పోటాపోటీ నెలకొంది.

■ బాల్కొండలో బీఆర్ఎస్ నుంచి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ తరఫున మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, కాంగ్రెస్ నుంచి ముత్యాల సునీల్‌రెడ్డి హోరాహోరీగా తలపడుతున్నారు. ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

■ ఆర్మూర్ నియోజకవర్గంలో మొదట్లో కాంగ్రెస్‌కు మంచి సానుకూలత ఉన్నప్పటికీ అభ్యర్థి వినయ్‌రెడ్డి స్పీడ్ తగ్గడంతో అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ముందుకు వచ్చారు. బీఆర్ఎస్ సిట్టింగ్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సైతం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

■ బోధన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, సిట్టింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్, బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి మధ్య త్రిముఖ పోటీ నడుస్తోంది.

■ నిజామాబాద్ రూరల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి మధ్య నువ్వా నేనా అనేలా పోటీ నడుస్తోంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి కులాచారి దినేశ్ నామమాత్రంగా పోటీలో ఉన్నారు. ఆయన డిచ్‌పల్లి మండలంలో మాత్రమే ప్రభావం చూపిస్తున్నారు.

■ బాన్సువాడలో బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మంచి జోష్‌మీద ఉన్నారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ మున్నూరుకాపు కావడంతో కలిసి వస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డికి సెటిలర్స్ మద్దతుతో బలం పెరిగినప్పటికీ, ఆయనపై దళితుల భూముల కబ్జా ఆరోపణలు ఉండడంతో ప్రభావం చూపిస్తోంది.

■ ఎల్లారెడ్డిలో సిట్టింగ్, బీఆర్ఎస్ అభ్యర్థి సురేందర్, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్, బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి మధ్య త్రిముఖ పోరు నెలకొంది.

■ జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావు, బీజేపీ అభ్యర్థి అరుణతార మధ్య పోటాపోటీ నెలకొంది.

ఆడపిల్లల కోసం ఆలోచన చేయని కాంగ్రెస్

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌నాగారం : కాంగ్రెస్ అధికారంలో ఉన్న 60 ఏళ్లలో ఆడపిల్లలకు సాయం చేయాలన్న ఆలోచన చేయలేదని.. ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్ష సాయం చేసి అండగా ఉంటున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నగరంలోని 11వ డివిజన్‌లోని 50 క్వార్టర్స్, పూజారి కాలనీ, బహుజన కాలనీ, అసద్‌బాబానగర్, బబన్‌సాబ్ పహాడ్‌లో ఆమె బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఒకటే మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ఉండేదని, తెలంగాణ వచ్చిన తర్వాత 22 పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. మళ్లీ అధికారంలోకి రాగా నే రేషన్‌కార్డు సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ హబ్ అభివృద్ధి చేసి 3,500 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు.

నాగారం ప్రాంతాన్ని దత్తత తీసుకుంటా

గత పాలకుల హయాంలో అభివృద్ధికి నోచుకొని నాగారం ప్రాంతాన్ని దత్తత తీసుకోని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా అన్నారు. రోడ్లు, మంచినీటి సమస్య పరిష్కరించి న్నట్లు తెలిపారు. బబన్‌సాబ్‌పహాడ్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో నిధులు తెచ్చి నిర్మిస్తున్నామన్నారు. మరోసారి దీవించి గెలిపించాలని కోరారు. మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్ బొడిగం కోమల్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆర్మూర్‌లో మొదటి ఏకగ్రీవ ఎన్నిక

- 1962లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల రంగారెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గంలో 1962లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల రంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌కు చెందిన ఆయన మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీకి నిలిచారు. అప్పట్లో రాజకీయాలపై పెద్దగా ఆసక్తి లేని కారణంగా ప్రత్యర్థులు ఎవరూ పోటీ చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం 1967, 1972 ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

ఖలీల్‌వాడి: ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 28 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 4 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. దీని ప్రకారం.. ఐదుగురి కంటే ఎక్కువ మంది సమావేశాలు నిర్వహించొద్దు. ఊరేగింపులు, ప్రచారం నిషేధం. ఓటర్లను ప్రభావితం చేసేలా చర్యలు చేపట్టొద్దు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, మత్తు పదార్థాలు వినియోగించొద్దు. మద్యం, కల్లు పంపిణీ చేయొద్దు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం, చిత్రాలు చూపడం నేరం. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అంతరాయం కలిగించే ఏదైనా మందే, ఇతర పదార్థాలను తీసుకు వెళ్లడానికి వీలులేదు. పాటకులు పేల్చడం నిషేధించారు. పార్టీలకు అనుకూలంగా ఓటర్లతో ప్రమాణం చేయించకూడదు.

టోకెన్ పద్ధతిలో మద్యం విక్రయించొద్దు

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం దుకాణాల నిర్వాహకులు రాజకీయ పార్టీల అభ్యర్థులకు టోకెన్ విధానంలో మద్యం విక్రయిస్తున్నారని, ఇలా చేయడం నేరమని సీపీ కల్మేశ్వర్ ఒక ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండో వారంలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఖలీల్‌వాడి: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ ప్రదర్శన డిసెంబర్ రెండో వారంలో నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ విషయమై జిల్లాలోని అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ హెచ్‌ఎంలకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. టీచర్లు ఎగ్జిబిషన్‌లో నూతన ఆవిష్కరణలతో కూడిన బోధన అభ్యాసనా సామగ్రిని ప్రదర్శించాల్సి ఉంటుందని అన్నారు. బీఎడ్, డీఎడ్ ట్రైయినీ విద్యార్థులు కూడా నూతన ఆవిష్కరణలతో కూడిన అభ్యాసనా సామాగ్రిని ప్రదర్శించవచ్చన్నారు. ప్రదర్శనలో రెండో రోజు 'చిరుధాన్యాలపై ఆరోగ్యం' అనే అంశంపై సెమినార్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనను సైతం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌తో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 97 మంది విద్యార్థులు ఇందులో పాల్గొంటారని, వారి బ్యాంకు ఖాతాల్లో అవార్డు ప్రదర్శన డబ్బులు జమ చేస్తామని తెలిపారు. హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు శ్రద్ధ వహించి ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ నంబర్ 9848219365ను సంప్రదించాలన్నారు.

అవకాశం ఇవ్వండి.. నేనేంటో చూపిస్తా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏంటో, తానేంటో చూపిస్తానని బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమవుతుందని గ్రహించిన ప్రజలు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బోధన్‌లో అవినీతి పేరుకు పోయిందని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలని అన్నారు. ఎమ్మెల్యేగా తొలిసారిగా పోటీచేస్తున్నానని ప్రజలు ఆదరించి బీజేపీని గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వడ్డి మోహన్‌రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

– బోధన్



ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

సమాధానం: నియోజకవర్గంలో నేను ఊహించిన దానికంటే ఎక్కువగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. యువగర్జన సభకు ఎంపీ అర్వింద్ హాజరయ్యారు. నియోజకవర్గంలో రెండో రోజుల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారానికి బీజేపీ అగ్రనేతలు అమిత్‌షా, జేపీ నడ్డా రానున్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

ప్రజా సమస్యలపై మీ సమాధానం?

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో అంతా అవినీతే జరిగింది. నియోజకవర్గంలో అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట రుణమాఫీ, భూసమస్యలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ సమస్యతో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలపై ఎమ్మెల్యే షకీల్ దృష్టి సారించలేదు. బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి తప్పకుండా సాధ్యమవుతుంది.

పదేళ్లలో అభివృద్ధి ఎలా ఉంది?

బోధన్ గత వైభవాన్ని కోల్పోయింది. నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతపడిపోయింది. దీంతో చెరుకు రైతులు, వ్యాపార వర్గాలు, కార్మికులకు ఎంతో నష్టం కలిగింది. ప్రభుత్వ వివిధ శాఖల కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏం జరగలేదు.

ఎన్నికల పోటీ బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యేనా..?

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి గెలిచే అవకాశం లేదు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌ను ఓడించాలంటే బీజేపీతోనే సాధ్యమనే అభిప్రాయంతో ప్రజలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీతో విజయం.

నిజాంషుగర్స్ పునరుద్ధరణపై మీరిచ్చే హామీ..?

ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తాం. ఇచ్చిన హామీని బీజేపీ ఖచ్చితంగా నెరవేరుస్తుంది. ఫ్యాక్టరీ ప్రారంభమైతే ఎంతో మందికి ఉపాధి కలుగుతుంది.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటే అన్న ఆరోపణపై..?

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలు. ఆ పార్టీలే లోపాయి కారి ఒప్పందాలతో రాజకీయాలు చేస్తున్నాయి. 2006లో నవీపేట జెడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేసినప్పుడు తనను ఓడించేందుకు ఆ రెండు పార్టీలు ఏకమయ్యాయి.

ప్రజలకు మీరిచ్చే హామీలు?

బీజేపీ మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా అన్ని హామీలను నెరవేరుస్తాం. మూతపడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం. యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు మద్దతు ధర కల్పిస్తాం. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ఏడాదికి 4 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. రూ. పది లక్షల వరకు ఆరోగ్య బీమా, ఆడపిల్లల వివాహాలకు రూ.2 లక్షలు అందిస్తాం.

ప్రజల నుంచి ఏమైనా ఆశిస్తున్నారా..?

నేను 25 ఏళ్ల నుంచి రాజకీయ ప్రజా జీవితంలో కొనసాగుతున్నా.. నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడిని. తొలిసారిగా బోధన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నా గెలిపించాలని ప్రజలను వేడుకుంటున్నా. గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను గెలిపించిన ప్రజలు ఈ సారి బీజేపీకి అవకాశం కల్పించాలని కోరుకుంటున్నారు. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

కామారెడ్డిలో ఇరు పార్టీల బాహాబాహీ



మసీదు ఎదుట ముజీబొద్దీన్‌తో పాటు కార్యకర్తలు



కాంగ్రెస్ కార్యకర్తలు

- గంట పాటు ఉత్కంఠ వాతావరణం
- చెదరగొట్టిన పోలీసులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య శుక్రవారం బాహాబాహీ చోటు చేసుకుంది. పట్టణంలోని పాత బస్టాండ్‌వద్ద ఉన్న మసీదులో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో పాటు కార్యకర్తలు నమాజ్ చేసి కిందికి వచ్చారు. పెద్ద ఎత్తున పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో నమాజ్ ఎదుట ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు సైతం నినాదాలు చేశారు. దీంతో గంట పాటు మసీదు ఎదుట ఉత్కంఠ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ ప్రకాశ్, సీఐ నరేశ్ హుటాహుటిన చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో పాటు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, కౌన్సిలర్ అన్వర్‌తో మాట్లాడారు. ఎన్నికల నిబంధనల మేరకు మసీదుల ఎదుట ప్రచారం, నినాదాలు చేయొద్దని హెచ్చరించారు. వారం క్రితం ఇదే మసీదు ఎదుట ముజీబొద్దీన్ ముందు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రతీకారంగా శుక్రవారం బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేసినట్లు సమాచారం. కాగా ఈ గొడవలు జరుగుతున్న క్రమంలో మరో స్వతంత్ర అభ్యర్థి ఆరీఫ్ బాబా అక్కడే ప్రచారం చేస్తుండగా అతన్ని పోలీసులు హెచ్చరించి పంపించారు.

పోలీసుల అదుపులో కాంగ్రెస్ కార్యకర్త!

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన చరణ్ అనే కాంగ్రెస్ కార్యకర్తను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసినట్లు విశ్వాసనీయంగా తెలిసింది. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల వద్ద నుంచి డబ్బులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ల ఫొటోలు చరణ్ వద్ద ఉన్నాయన్న సమాచారం మేరకు అతనిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సమాచారం. చరణ్ అరెస్టు విషయమై ఎస్సై వినయ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

అకారణంగా పోలీసుల దాడి

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన చరణ్‌పై పోలీసులు శుక్రవారం ఉదయం అకారణంగా దాడి చేసి నిర్బంధించారని బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ ఆరోపించారు. వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన చరణ్‌ను ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చరణ్ దగ్గర డబ్బులు ఉన్నాయన్న ఆరోపణతో ఇల్లు, కారు సోదా చేసి ఠాణాకు తీసుకు వచ్చారన్నారు. ఫోన్‌లో మెసేజ్ వచ్చిందన్న కారణం చూపుతూ దాడి చేశారని, ఒక్క రూపాయి కూడా దొరకక పోయినా నిర్బంధించారని ఆరోపించారు. అన్నం తినడానికి కూడా అనుమతించడం లేదన్నారు. బ్యాంకులో ఉన్న డబ్బుల గురించి ఆరాతీసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అధికారి పార్టీ అండతో పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి మేకలు, మద్యం పంచుతున్న పోలీసులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికే పోలీసులు దాడులు చేస్తున్నారన్నారు. కార్యకర్తలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న సునీల్‌కుమార్

అమిత్‌షా సభతో జోష్



ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్‌షా



అమిత్‌ షాతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఆర్మూర్‌లో శుక్రవారం నిర్వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభ విజయవంతం అయింది. బీజేపీ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఆధ్వర్యంలో సకల జనుల సంకల్ప సభను నిర్వహించారు. ఈ సభతో బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



అమిత్‌షాకు అభివాదం చేస్తున్న ప్రజలు, కార్యకర్తలు

జనాలతో కలిసి...



నిజామాబాద్‌నాగారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో బిజిబిజీగా గడుపుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ నగరంలోని సవేరా హోటల్‌లో టీ తాగుతూ ఆమె అక్కడ ఉన్న జనాలతో ముచ్చటించారు. ఎమ్మెల్సీ కవితతో సెల్ఫీలు దిగడానికి చాలా మంది పోటీ పడ్డారు. అకస్మాత్తుగా కవిత తమ హోటల్‌ను సందర్శించడంపై యజమాని, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

డిచ్‌పల్లి: వరంగల్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే తెలంగాణ స్టేట్ లెవల్ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఖోఖో పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు శుక్రవారం బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్, ఆర్‌సీవో అలివేలు మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్, చిరంజీవి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.గంగాధర్, టీమ్ కోచ్, మేనేజర్ జ్యోత్స్న, మానస, సాప్పురి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో అధికారులు

అంతు చిక్కని ఓటరు నాడి..

- పోలింగ్ శాతం పెంచడానికి అధికారుల ప్రయత్నాలు
- సొంత సర్వేలతో ఓట్లను లెక్కించుకుంటున్న అభ్యర్థులు

ఆర్మూర్: ఎన్నికల తుది ఘట్టమైన పోలింగ్ సమయం దగ్గర పడుతోంది. ఈ నెల 30న పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని పోటీలో నిలిచిన అభ్యర్థుల్లో తమ నాయకుడిని ఎన్నుకోనున్నారు. అయితే ఇందులో డబ్బు, మద్యం ఏరులై పారుతున్నా ప్రస్తుత ఎన్నికల్లో ఓటరు నాడిని గుర్తించడంలో అన్ని పార్టీల నాయకులు, అభ్యర్థులు ఆపసోపాలే పడుతున్నారు. ఎవరికి వారు తమ సొంత సర్వేలతో తమకు పడే ఓట్ల సంఖ్యను లెక్కించుకుంటూ గెలుపుపై ధీమాను ప్రదర్శిస్తున్నారు. మరో వైపు అధికారులు ఇప్పటికే ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన సదస్సులు నిర్వహించి కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాలను పూర్తి చేశారు. పోలింగ్ శాతాన్ని పెంచడానికి అధికారులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 2009, 2014, 2018లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సరళిని ప్రస్తుత ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఓటర్ల సంఖ్య పెరిగినా.. తగ్గినా పోలింగ్ శాతాల్లో మాత్రం పెద్దగా మార్పు కనిపించడం లేదు. అందుకు కారణం మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నా పురుషులు మాత్రం ఆసక్తి చూపించకపోవడమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



2023లో పెరిగిన ఓటర్లు..

2009లో 73.63 శాతం, 2014లో 73.62 శాతం, 2018లో 78.45 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018 ఓటర్లతో పోలిస్తే 2023 ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,10,217 ఉండగా అందులో పురుషులు 98,274, మహిళలు 1,11,937 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. గత ఎన్నికలకంటే 32,771 మంది ఓటర్లు పెరిగారు. కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో గణనీయంగా ఓటర్ల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. ఇక ఎంతమంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారో వేచి చూడాల్సిందే..

నర్సింగ్‌పల్లిలో మధ్యాహ్న భోజనం బంద్

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పది రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు వ్యక్తిగత కారణాలతో నిలిపేశారు. దీంతో ఇంటి నుంచే విద్యార్థులు భోజనం తెచ్చుకుంటున్నారు. ఈవిషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లామని, త్వరగా కొత్త వారిని నియమించాలని ఆదేశించినట్లు హెచ్‌ఎం ఉష శ్రీ తెలిపారు. మూడు రోజుల్లో కొత్త వారిని నియమిస్తామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

తనిఖీల్లో నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ చెక్ పోస్ట్ వద్ద గురువారం అర్ధరాత్రి చేపట్టిన వాహనాల తనిఖీలో రూ. 6లక్షల5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా నగదు లభ్యమైనట్లు పేర్కొన్నారు. వీటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద లారీ కారును శుక్రవారం ఢీకొన్నది. మామిడిపల్లి నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న లారీ దానికి ముందున్న కారు ఆకస్మాత్తుగా పక్కకు వెళ్లడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



నవీన్ మృతదేహం

కమ్మర్‌పల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్‌కు చెందిన జనార్దన్ నవీన్(36) బైక్‌పై మెట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కమ్మర్‌పల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నవీన్ తలకు, కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. నవీన్ సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చింతకుంటలో నెమలి..



నెమలి కళేబరం

వర్ని(మోస్రా): మండలంలోని చింతకుంట వెళ్లే అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని నెమలి మృతి చెందినట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నెమలి మృతి చెందినట్లు చెప్పారు. నెమలి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేంజ్ ఆఫీసుకు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులను వేధించినందున దేహశుద్ధి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఉపాధ్యాయుడిపై స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం దేహశుద్ధి చేశారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురిచేసేవాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై ప్రధానపాధ్యాయురాలి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో ఆగ్రహం చెందిన తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

అదనపు కంట్రోల్ యూనిట్ల తరలింపు

- పర్యవేక్షించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేపడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్ : నగరంలోని ఈవీఎం గోడౌన్ నుంచి శుక్రవారం జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు అదనపు కంట్రోల్ యూనిట్లు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ తరలింపు ప్రక్రియ నిర్వహించారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని సముదాయంలో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ జరిపారు. ఆ జాబితాను అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లను నియోజకవర్గాల బాధ్యులకు అప్పగించారు. ఇప్పటికే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈవీఎంల తరలింపు పూర్తయ్యింది. పోలింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తినా.. ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడకూడదనే ఉద్దేశంతో అదనపు కంట్రోల్ యూనిట్లు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. అదనపు ఈవీఎంలు సెక్టోరల్ అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే నిమిషాల వ్యవధిలోనే సెక్టోరల్ అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని రిజర్వ్‌లో ఉండే ఈవీఎంను కేటాయిస్తారని తెలిపారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, ఈడీఎం కార్తీక్ పాల్గొన్నారు.